క్లుప్తంగా

అమరవీరులకు నివాళి



అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సమితి నాయకులు

పహాడీషరీఫ్: ఎమ్మార్పీఎస్ ఉద్యమ సమయంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలు వృథా కానివ్వమని ఎమ్మార్పీఎస్ జల్‌పల్లి గ్రామ కమిటీ నాయకుడు యంజాల శివకుమార్ అన్నారు. మాదిగ అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకొని శనివారం రాత్రి జల్‌పల్లి గ్రామంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ స్థాపించి 30 ఏళ్ల పాటు చేసిన ఉద్యమంలో ఎంతో మంది తమ ప్రాణత్యాగాలు చేశారన్నారు. ఎస్సీ వర్గీకరణతో వారి ఆత్మకు శాంతి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో నర్సింహ, రామారావు, యాదగిరి, మహేందర్, జంగయ్య, దానయ్య, జగన్, జ్ఞానేశ్వర్, శ్రీనాథ్, బాలకృష్ణ, అశ్విన్ కుమార్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను శుభ్రంగా ఉంచాలి



సిబ్బందితో మాట్లాడుతున్న మొద్దు లచ్చిరెడ్డి

ఎల్బీనగర్: కాలనీల్లోని రోడ్లను శుభ్రంగా ఉంచాలని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సూచించారు. ఆదివారం మార్నింగ్‌వాక్‌లో భాగంగా ఆదివారం ఆయన డివిజన్లలోని పలు కాలనీలలో పర్యటించారు. కాలనీలో పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ జవాన్ యాదయ్య, బాలకృష్ణ, పురుషోత్తం, రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం యోగా చేయాలి

హస్తినాపురం: భారతీయ యోగా సాంస్థాన్ ఆధ్వర్యంలో విశ్వేశ్వర ఇంజనీర్స్ కాలనీ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యోగా శిక్షకులు కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిత్యం యోగా చేస్తే శరీరంతో పాటు మనస్సును అదుపులో ఉంచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మాధవరెడ్డి, వెంకటేశ్వర్లు గౌడ్, యాదగిరి, ప్రభాకర్, వాణి, మోహన్, వెంకటనారాయణ, సత్తయ్యగౌడ్, విజయభాస్కర్ రెడ్డి, అమరనాథ్‌యాదవ్, ఐలేష్‌గౌడ్ పాల్గొన్నారు.

వైద్య వృత్తి చాలా గొప్పది



వైద్యుడిని సన్మానిస్తున్న గడ్డం ప్రసాద్

దిల్‌సుఖ్‌నగర్: వైద్య వృత్తి చాలా గొప్పదని ప్రకృతి వైద్యం నుంచి రోబోటిక్స్ వైద్యం వరకు అధునాతన వైద్యం అభివృద్ధి చెందుతుందని స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. కొత్తపేటలో శనివారం రాత్రి నిర్వహించిన ఓజోన్ హాస్పిటల్ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైద్య వృత్తిని మానవతా కోణంలో చూస్తున్న ఓజోన్ హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు. కోవిడ్ సమయంలో వారు చేసిన సేవలు మరువలేనివన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంతో విద్యా, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. హాస్పిటల్ చైర్మన్ సత్యసాయి ప్రసాద్, ఎండీ దీప్తి మాట్లాడుతూ.. హాస్పిటల్ నెలకొల్పి లాభాలపేక్షతో కాకుండా సమాజానికి తమ వంతు సహాయంగా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. సీఈఓ శ్రీనివాసరావు, ఎండీ మధుసూదర్‌రెడ్డి, డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన దేరంగుల ఎల్లమ్మ– పాండు దంపతుల కుమార్తె మహేశ్వరి వివాహం ఆదివారం మండల కేంద్రంలో జరిగింది. నిరుపేద కుటుంబం కావడంతో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్‌నాయక్ రూ.21 వేలతో పాటు, పట్టు చీరను బహూకరించారు. అదే విధంగా మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కదారి రామకృష్ణ, మాజీ ఉప సర్పంచ్ శారద, నాయకులు పాండునాయక్, లాయక్ అలీ, లక్ష్మణ్‌నాయక్, యాదయ్య, వెంకటేశ్, పాండు, రాజు, జగన్, యాదయ్య, జంగయ్య నాయకులు తదితరులు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్ ఏర్పాటుపై కసరత్తు

త్వరలోనే బడంగ్‌పేటలో ఠాణా ఏర్పాటు

- భవనం వెతికే పనిలో నిమగ్నం
- మీర్‌పేట సిబ్బందికి తగ్గనున్న భారం
- నేరాలను కట్టడి చేయొచ్చంటున్న పోలీసులు



మీర్‌పేట పోలీస్‌స్టేషన్

మీర్‌పేట: శాంతి భద్రతల పరిరక్షణ మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా కొత్త పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుపై కసరత్తు చేస్తోంది. మీర్‌పేట స్టేషన్‌లో సిబ్బందిపై భారం పడుతుండడంతో బడంగ్‌పేటలో అదనపు ఠాణా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

త్వరలోనే ఏర్పాటు..

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు కసరత్తు చేస్తుండగా.. అందులో బడంగ్‌పేట నూతన పోలీస్‌స్టేషన్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. బడంగ్‌పేట పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ఇక్కడి ప్రజలు, నేతలు ఇటీవల పోలీసు ఉన్నతాధికారులను కలిసి లేఖలు కూడా సమర్పించారు. మీర్‌పేట నుంచి బడంగ్‌పేట, గుర్రంగూడ ప్రాంతాలతో పాటు శివారులోని ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ నుంచి నాదర్‌గుల్, కుర్మల్‌గూడ, బాలాపూర్ నుంచి సాయినగర్ మరికొన్ని ప్రాంతాలను కలిపి బడంగ్‌పేట పోలీస్‌స్టేషన్‌గా రూపాంతరం చెందనుంది.

సిబ్బందికి భారం..

మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధి ఎక్కువ కావడం, జనాభా కూడా ఎక్కువగా ఉండడంతో నెలకు దాదాపుగా 130 నుంచి 140 వరకు కేసులు నమోదవుతున్నాయి. ప్రస్తుతం పోలీసు అధికారులతో పాటు సిబ్బందితో కలిపి మొత్తం 140 మంది విధులు నిర్వహిస్తున్నారు. నూతన పోలీస్‌స్టేషన్ ఏర్పాటుతో అదనపు సిబ్బంది నియామకం, పెట్రోలింగ్ కూడా పెంచుకునే అవకాశం ఉండడంతో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు, నేరాలను మరింత కట్టడి చేయొచ్చని పోలీసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చిన వెంటనే స్టేషన్ ఏర్పాటు చేసేందుకు గాను పోలీసు అధికారులు తాత్కాలికంగా భవనం వెతికే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఏఆర్‌సీఐ రోడ్డులో అయితే అన్ని విధాలా అందరికీ అందుబాటులో ఉంటుందన్న ఉద్దేశంతో అక్కడే ఏర్పాటు చేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

మౌలిక సదుపాయాల కల్పనలో విఫలం

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాంచందర్



సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

కందుకూరు: స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడుస్తున్నా నేటికీ పేదలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాంచందర్ విమర్శించారు. సీపీఎం పార్టీ పిలుపుమేరకు ఆదివారం మండల పరిధిలోని నేదునూరు గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన పర్యటించి గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. 2006 తర్వాత మళ్లీ ఇంతవరకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. అర్హులైన వృద్ధులకు పింఛన్లు అందడం లేదన్నారు. కంప్యూటర్ సాకుతో నేటికీ అర్హులైన చాలా మందికి ఉచిత విద్యుత్ పథకం అందడం లేదని ఆరోపించారు. మండలంలోనే పెద్ద గ్రామ పంచాయతీ అయిన నేదునూరును విస్మరించడం బాధాకరమన్నారు. సమస్యలు పరిష్కరించేవరకు ప్రజల వెంట ఉండి పోరాడుతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకుడు బి.శ్రీనివాస్, ఎ.కుమార్, గ్రామ కార్యదర్శి ఎం.యాదయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ నాగోలు ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ హనుమాన్‌నగర్, గౌటేటి ఫంక్షన్‌హాల్, సాయినగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు. 11కేవీ జైన్‌మందిర్, కమలానగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

హమాలీలకు లైసెన్స్ అందజేత



లైసెన్స్ అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: గత 20 ఏళ్లుగా మార్కెట్‌లో పనిచేసే హమాలీలకు గుర్తింపు లైసెన్స్ లేవని మా పాలకవర్గం ఏర్పాటు తర్వాత అటు బాటసింగారం పండ్ల మార్కెట్, ఇటు ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్‌లోని హమాలీలకు గుర్తింపు లైసెన్సుతో పాటు ప్రమాద బీమా, రెండు జతల దుస్తులు అందజేస్తున్నామని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌లోని ఎన్టీఆర్‌నగర్ కూరగాయల మార్కెట్‌లో పనిచేసే 75 మంది హమాలీలకు గుర్తింపు లైసెన్సులను అందజేశారు. ఈ సందర్భంగా చిలుక మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరంతరం శ్రమించే హమాలీలను కుటుంబ సభ్యులుగా పరిగణిస్తాం వారికి రావాల్సిన ప్రయోజనాలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ భాస్కరాచారి, ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్ శ్రీనివాస్, వహీద్ తోపాటు పాలకవర్గ సభ్యులు బండి మధుసూదన్ రావు, పన్యాల జైపాల్ రెడ్డి, నవరాజ్, బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, మెగావత్ గణేష్ నాయక్, చెన్‌రెడ్డి రఘుపతి రెడ్డి, మేకం లక్ష్మి, దోమలపల్లి అంజయ్య, నరసింహ, ఇబ్రహీం, సిఐటియు నాయకులు వీరయ్య, చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు



ఆలయంలో భజనలు, పూజలు చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. తెల్లవారుజామున ఆలయంలో శివపార్వతులకు అభిషేకం, హారతి, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పాలంకరణ, మంత్ర పుష్పం పలు పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు చివరిరోజు కావడంతో తెల్లవారుజామున దోపోత్సవం నిర్వహించి విగ్రహాలను పల్లకీసేవలో ఊరేగించారు. శివగంగలో గుమ్మడికాయ కొట్టి దిష్టి తీసి శివపార్వతుల విగ్రహాలను ఊరేగింపు చేసి ఆలయంలో ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలు విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, ఆలయ ఈఓ మురళీకృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఉత్సవాలకు సహకరించిన దాతలు, పని చేసిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలతో పాటు, పలు శాఖల అధికారులను ఆలయ చైర్మన్ ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు మోదిని రాకేశ్, ఒగ్గు శంకర్, పెయ్యల సువర్ణ, పోతర్ల తిరుపతయ్య, గద్దగూటి నరేశ్, ఏపూరి సాయిలు, కనగట్ల శ్రీశైలం, ఆలయ ఈఓ మురళీకృష్ణ, ఆలయ మాజీ చైర్మన్లు నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, కూన యాదయ్య, కాకి ఈశ్వర్, మునగపాటి నవీన్, కాకి కుమార్, నాగేశ్వర్, మాజీ ఆలయ డైరెక్టర్ కర్రోళ్ల చంద్రయ్య, కర్రోళ్ల భానుచందర్, న్యాయవాది అశోక్, మాజీ సర్పంచ్ ఆనందం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పోతర్ల సుదర్శన్‌యాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్లు పోల్కం బాలయ్య, కడమోని ప్రభాకర్, ఏకలవ్య, ఆలయ ప్రధాన పూజారి వీరేశం, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రీడింగ్ రూమ్ ప్రారంభం



రీడింగ్ రూమ్ ప్రారంభోత్సవంలో మల్‌రెడ్డి రాంరెడ్డి

నాగోలు: గ్రంథాలయాలు సామాజిక ఆవశ్యకత మాత్రమే కాకుండా, అన్ని వయస్సుల వారికి విజ్ఞానాన్ని పెంపొందించే వేదికలుగా నిలుస్తాయని రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. ఆదివారం నాగోలు డివిజన్‌లోని శ్రీ సాయినగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయ రీడింగ్ రూమ్‌ను నాగోలు కార్పొరేటర్ చింతల అరుణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీనియర్ సిటిజన్ల కోసం ఏర్పాటు చేసిన ఈ గ్రంథాలయం వారికి సమాజంతో మరింత మమేకమయ్యేలా చేస్తుందని, పుస్తక పఠన సంస్కృతిని ప్రోత్సహించడంలో ఈ తరహా గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. సాయినగర్‌లోని సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వాటికి త్వరలోనే పరిష్కార మార్గం చూపేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని హామీ ఇచ్చారు. మంజుల రెడ్డి, సురేందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, గణేష్ నాయక్, దయానంద్ రెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీనివాస చార్యులు, పాండురంగాచారి, నగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి..

నాగోలు: సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం రీడిండ్ రూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా శ్రీసాయినగర్ సౌత్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నుంచి 30 మంది వచ్చి తనపై దాడి చేశారని వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీ సాయినగర్ కాలనీ చెందిన సీనియర్ సిటిజన్ ప్రధన కార్యదర్శి రామచంద్రారెడ్డి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీసాయినగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో గ్రంథాలయం నిర్వహిస్తున్నామని కొంతమంది దాతల సహాయంతో పైఅంతుస్తులో రీడింగ్ రూమ్ నిర్మాణం చేసినట్లు ఆయన తెలిపారు. ఆదివారం ప్రారంభోత్సవం ఏర్పాటు చేయడంతో ఈ విషయం తెలుసుకున్న శ్రీసాయినగర్ సౌంత్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, ఇతర సభ్యులు మా కార్యక్రమం దగ్గర వచ్చి వారే రిబ్బన్ కట్ చేశారన్నారు. తనపై పోలీసుల సమక్షంలో దాడి చేశారన్నారు. తనకు శ్రీసాయినగర్ సౌంత్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శి ఇతర సభ్యులతో ప్రాణహాని ఉందని తనకు రక్షణ కల్పించాలి ఫిర్యాదులో పేర్కొన్నాడు.

పదిమంది ట్రాన్స్‌జెండర్స్ అరెస్ట్

చైతన్యపురి: రాత్రివేళల్లో రోడ్లపై తిరుగుతూ కాలనీవాసులకు ఇబ్బందులు కలిగిస్తున్న పలువురు ట్రాన్స్ జెండర్స్‌ను సరూర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పీఅండ్‌టీ కాలనీలో కల్లు కాంపౌండ్ సమీపంలో ఉంటూ ట్రాన్స్‌జెండర్స్ రాకపోకలు సాగించే వారిపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఇబ్బందులు కలిగిస్తున్నారని కాలనీవాసులు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, ఎస్ఓటీ పోలీసులు, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పది మందిని అదుపులోకి తీసుకుని సరూర్‌నగర్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



జ్యోతి ప్రజ్వలన స్తున్న జస్టిస్ సురపల్లి నందా

నాగోలు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జస్టిస్ సురపల్లి నందా అన్నారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) తెలంగాణ శాఖ మహిళా విభాగం ఆధ్వర్యంలో నాగోలు పీబీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో జస్టిస్ సురపల్లి నందా పాల్గొని మాట్లాడారు. దేశంలోని మహిళలు ఓటింగ్‌లో పాల్గొంటారని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ దిగువస్థాయిలలో పురుషుల కన్నా ఎక్కువ పోటీ చేస్తున్నారన్నారు. రాజకీయాల్లో లింగ అసమానతలను రూపుమాపడానికి భారత ప్రభుత్వం స్థానిక ప్రభుత్వ స్థానాలలో మహిళల కోసం రాజకీయ రిజర్వేషన్లు ఏర్పాటు చేసిందన్నారు. ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ.. నేడు మహిళలు పురుషులకు సమానంగా రాణిస్తున్నారన్నారు. వైశ్య ఫెడరేషన్ న్యూఢిల్లీ ప్రెసిడెంట్ అశోక్ అగర్వాల్ మాట్లాడుతూ.. మహిళలు రాజకీయ రంగాలక్షేళ రాణిస్తున్నారని, ఉదాహరణకు న్యూఢిల్లీ శాఖ కన్వీనర్‌గా ఉన్న గీతాగుప్తా ఢిల్లీ ముఖ్యమంత్రి అవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ న్యూఢిల్లీ సలహా కమిటీ చైర్మన్‌గంజి రాజమౌళి గుప్తా, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్, తెలంగాణ ఐవీఎఫ్ చీఫ్ అడ్వైజర్ ముత్యాల సత్తయ్య, సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ కక్కిరాల రమేష్, నాయకులు గట్టు మహేష్, జి.చంద్రయ్య, మహిళా చైర్ పర్సన్ ఉప్పల స్వప్న, అధ్యక్షురాలు చందా భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ట్రాక్ తప్పిన ‘వాకింగ్ ట్రాక్’ పనులు



వాకింగ్ ట్రాక్ పక్కన పేరుకుపోయిన చెత్త

- నాలుగేళ్లుగా కొనసాగుతున్న వైనం
- పూర్తి చేయాలంటున్న ప్రజలు
- విస్మరిస్తున్న అధికారులు

చైతన్యపురి: మినీ ట్యాంక్ బండ్‌గా పేరొందిన సరూర్‌నగర్ చెరువు చుట్టూ నిర్మాణం జరుగుతున్న వాకింగ్ ట్రాక్ పనులు నాలుగేళ్లగా కొనసాగుతూనే ఉన్నాయి. మిషన్ కాకతీయ ఫేజ్–4లో భాగంగా రూ 9.5 కోట్ల వ్యయంతో 2020 జూన్‌లో ప్రారంభం అయ్యాయి. మినీట్యాంక్ బండ్‌కు వాకింగ్ ట్రాక్ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారుతుందని అందరూ భావించారు. మినీట్యాంక్ బండ్ వద్ద ఇప్పటికే ఇందిరా ప్రియదర్శిని పార్కు అందుబాటులో ఉంది. వాకింగ్ ట్రాక్ పూర్తియితే చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ కోసం మట్టి పోసి కట్ట తయారు చేశారు తప్ప మిగిలిన పనులు మాత్రం ముందుకు సాగలేదు.

ఎక్కడి పనులు అక్కడే..

అధికారులు గతంలో ప్రకటించిన ప్రకారం 2021 జూన్‌లోగా పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ ఎక్కడ గొంగలి అక్కడే అన్నట్లు వాకింగ్ ట్రాక్ పనులు ఉన్నాయి. గోల్డెజ్ హోం నుంచి తపోవన్ కాలనీ వరకు 6.5 మీటర్ల వెడల్పుతో సుమారు రెండు కిలో మీటర్ల వరకు ట్రాక్ పనులు చేపట్టారు. ట్రాక్ ఇరువైపులా ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయాల్సి ఉంది. అంతేకాక ట్రాక్‌కు అడ్డుగా ఉన్న నిర్మాణాలు అలాగే వున్నాయి. సరూర్‌నగర్ చెరువులోకి వివిధ కాలనీల నుంచి వచ్చే వరదనీరు మళ్లించేందుకు స్ట్రామ్ నాలా డెవలప్‌మెంట ప్రోగ్రాం కింద వాకింగ్ ట్రాక్ నిర్మాణంలో అవసరమైన ప్రాంతాల్లో చాంబర్లు ఏర్పాటు చేసి ట్రాంక్‌లైన్ ద్వారా నీటిని శంకీశ్వరబజార్‌వైపు నాలాలో కలపాల్సి ఉంది. ఆ పనులు పూర్తయిన తర్వాత వాకింగ్ ట్రాక్ నిర్మాణం పనులను మార్చి 2022 వరకు పూర్తి చేస్తామని అప్పటి అధికారులు హామీలిచ్చినా పనులు మాత్రం ముందుకు సాగలేదు.

ప్రజాధనం వృథా..

నాలుగేళ్ల క్రితం పారంభించిన వాకింగ్ ట్రాక్ పనులు ఆలస్యం కావటం వల్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది. వేసిన కట్ట కూడా గుంతలుగా పడి అధ్వానంగా మారింది. అంతేకాక సమీప కాలనీల ప్రజలు ఇక్కడే వేస్తుండటంతో వేసి ట్రాక్ అందవిహీనంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం వాకింగ్ ట్రాక్ త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

కాంట్రాక్టర్‌తోనే ఆలస్యం

వాకింగ్ ట్రాక్ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ వేరే వ్యక్తికి సబ్ కాంట్రాక్ట ఇవ్వగా మధ్యలోనే వదిలి వెళ్లిపోవటంతో ఆలస్యమప మాట వాస్తవమే. వేరే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించి చేయించాలని నిర్ణయించాం. వచ్చేవారం పనులు ప్రారంభం అవుతాయి. త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తాం.

–టి.సతీష్,
ఇరిగేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని టీపీసీసీ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ వాసవి ఆధ్యాత్మిక కేంద్రంలో ఐరిస్ ఫ్లోరెట్స్ స్కూల్ నిర్వహించిన వార్షికోత్సవంలో దేప భాస్కర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. పిల్లలు సెల్‌ఫోన్ ప్రపంచంలో మునిగిపోకుండా ఉండాలంటే తల్లిదండ్రులు కూడా ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఇంట్లో పేదరికం పోవాలనా.. సమాజంలో మంచి గుర్తింపు రావాలన్నా విద్యావంతులుగా ఉండాలన్నారు. సమ సమాజ స్థాపన సైతం చదువుతోనే సాధ్యమని మంచి చదువుంటే మంచిజ్ఞానం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐరిస్ ఫ్లోరెట్స్ స్కూల్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉపేందర్ రెడ్డి, రామకృష్ణ పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు,సురేష్, లింగా స్వామీ గౌడ్, నగేష్, విప్లవ రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జగన్



బ్రాహ్మణపల్లిలో ఇంటింటి సర్వే చేస్తున్న సీపీఎం నాయకులు

మాడ్గుల: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందుకూరి జగన్ ఆరోపించారు. ఆదివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో మండల పరిధి బ్రాహ్మణపల్లి గ్రామంలో ఇంటింటీ సర్వే చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని విమర్శించారు. అర్హులకు రేషన్ కార్డులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పలుమార్లు దరఖాస్తులు పెట్టుకున్నా వాటిని పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వాలు హామీలను నెరవేర్చాలని, లేదంటే వారి ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, శ్రీను, అచ్చయ్య, నరసింహులు పాల్గొన్నారు.